క్లుప్తంగా

శ్రీనివాసరావు దంపతులకు సన్మానం



సన్మానిస్తున్న ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో సుమారు 35 సంవత్సరాలు పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన అసిస్టెంట్ సూపరింటెండెంట్ కొత్తూరు శ్రీనివాసరావు దంపతులను డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. హెచ్‌ఓడీ కరీముల్లా మాట్లాడుతూ... సంస్థలో పూర్తి సర్వీసు చేసే అదృష్టం కొందరికే సాధ్యమవుతుందని, వారిలో శ్రీనివాసరావు ఒకరన్నారు. ఎస్‌ఈ శ్రీనివాస్, డీవైఎస్‌ఈ లింగా, పీఓ మజ్జిగ మురళీ, ఎస్‌ఈ అరవింద్, భద్రమ్మ, జి.శ్రీనివాస్, శశాంక్, యోగేంద్ర ప్రసాద్, గట్టయ్య, ఎండీ గౌస్ పాల్గొన్నారు.

ఆర్‌ఓ ప్లాంట్ వితరణ

సింగరేణి(కొత్తగూడెం): కార్మిక ప్రాంతం రామవరం పంజాబ్ గడ్డ శివారు ప్రాంతంలో ఉన్న మాతాశిశు ఆస్పత్రికి కొత్తగూడెం ఏరియా సింగరేణి యాజమాన్యం తరుపున రూ.లక్ష ఖర్చుతో ఏరియా జీఎం ఎం.శాలేంరాజు వితరణగా ప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు సంస్కృత సంభాషణ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.సంధ్యారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి నుంచి 12వ తరగతి బాలికలు అర్హులని పేర్కొన్నారు.

జేకే ఓసీ ఆపరేటర్ల బదిలీ..?

ఇల్లెందు: జేకే ఓసీ నుంచి పది మంది ఆపరేటర్లను మణుగూరుకు బదిలీ చేసేందుకు యాజమాన్యం నిర్ణయించింది. జేకే ఓసీ నుంచి బొగ్గు ఉత్పత్తి తగ్గింది. ఈ క్రమంలో అక్కడి బంపర్ ఆపరేటర్లను మరో చోటుకు బదిలీ చేయాలని నిర్ణయించారు. రెండు రోజుల క్రితం బదిలీలో వెళ్లాలనుకునేవారు తమకు అనుకూలమైన ప్రదేశానికి వెళ్లేందుకు దరఖాస్తు చేసుకోవాలని జేకే ఓసీలో నోటీస్ బోర్డ్ తెలిపారు. ఇటీవల అధికార పార్టీ ఐఎన్‌టీయూసీ నాయకులు బదిలీలు జరగకుండా చూస్తామని హామీ ఇచ్చిన విషయం విదితమే.. అయినా బదిలీకి రంగం సిద్ధం అయింది.

బాధ్యతలు స్వీకరించిన మెజిస్ట్రేట్ రవికుమార్



పాటిల్ వసంత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నూతన జడ్జి రవికుమార్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్‌గా బి.రవికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన జిల్లా జడ్జి పాటిల్‌వసంత్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఆయనకు అభినందనలు తెలిపారు.

జడ్జిని కలిసిన ట్రైనీ ఐఏఎస్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌ను గురువారం ట్రైనీ కలెక్టర్ సౌరబ్‌శర్మ మర్యాదపూర్వకంగా కలిశారు. న్యాయమూర్తి పాటిల్ వసంత్ చాంబర్‌లో ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెందు రాజమల్లు తదితరులు ఉన్నారు.

కార్మికుల హక్కుల సాధనే లక్ష్యం

శ్రామికలోకం మేడే వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. కార్మిక సంఘాల నాయకులు యూనియన్ జెండాలను ఆవిష్కరించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, టీయూసీఐ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ, ఆటో, బిల్డింగ్ వర్కర్స్, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కార్మికుల సమస్యలు, హక్కులపై మాట్లాడారు. కార్మికుల హక్కుల సాధనే లక్ష్యంగా పోరాటాలు చేస్తామని నినదించారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



పాల్వంచ: 1535 యూనియన్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న వజీర్



సూపర్‌బజార్(కొత్తగూడెం): జెండా ఆవిష్కరిస్తున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ఇల్లెందులో మాట్లాడుతున్న చంద్ర అరుణ



ఇల్లెందు: టీయూసీఐ ఆధ్వర్యంలో కార్మికుల ర్యాలీ



కొత్తగూడెంటౌన్: బిల్డింగ్ అండ్ వర్కర్స్ ఆధ్వర్యంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి రాజేందర్



సుజాతనగర్: సీపీఎం ఆధ్వర్యంలో..



సింగరేణి(కొత్తగూడెం): ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో..



జూలూరుపాడు: ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు



చుంచుపల్లి: ఆర్టీసీ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో..



ఇల్లెందురూరల్: ఐసీడీఎస్ కార్యాలయం వద్ద.. అంగన్‌వాడీ ఉపాధ్యాయులు



సింగరేణి(కొత్తగూడెం): ఇఫ్టూ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



టేకులపల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో..

'కృష్ణవేణి' విద్యార్థులకు కలెక్టర్, ఎమ్మెల్యే అభినందన



విద్యార్థులతో కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్మీడియట్ ఫలితాలలో రాష్ట్ర స్థాయి మార్కులు సాధించిన కొత్తగూడెంలోని కృష్ణవేణి కళాశాల విద్యార్థులను కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అభినందించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో కె.హాసిని 994/1000, బైపీసీలో బి.జోష్న 994/1000, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో ఆర్.భువన కృతి, బి.పవిత్ర, 468/470, బైపీసీలో ఆయేషా 436/440 సాధించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి జిల్లా ప్రగతిని రాష్ట్ర వ్యాప్తంగా ఇనుమడింపజేశారని, ఇంకా మంచి మార్కులు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలని కొనియాడారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి..

కొత్తగూడెంఅర్బన్: 2026లో యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్‌కు సిద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ నియంత్రణ పరిధిలో పనిచేస్తున్న తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రిలిమ్స్, మెయిన్స్‌కు ఉచిత శిక్షణ, వసతి సౌకర్యం అందించడం జరుగుతుందని, మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిజిటలైజ్డ్ తరగతి గదులు, ఢిల్లీ, ఇతర ప్రాంతాల నుంచి ప్రముఖ ఫ్యాకల్టీ, లైబ్రరీ, ఇంటర్నెట్, వైఫై సౌకర్యంతో హైదరాబాద్‌లో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన, అర్హత ఉన్న మైనార్టీ అభ్యర్థులున్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 24వ తేదీ లోగా నమోదు చేసుకుని శిక్షణకు హాజరు కావాలని కోరారు.

పాత వీల్‌చైర్లతో రోగుల అవస్థలు



విరిగిన వీల్ చైర్‌లో ఇబ్బంది పడుతూ వెళ్తున్న వృద్ధురాలు



కొత్త చైర్‌లో చెత్త తీసుకెళ్తున్న సిబ్బంది

- చెత్త తరలించేందుకు కొత్తవి.. రోగులకు విరిగిపోయినవి
- పట్టించుకోని అధికారులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని సర్వజన్ ఆస్పత్రిలో వీల్ చైర్లతో రోగులు అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రికి వివిధ వైద్య చికిత్సల నిమిత్తం వచ్చేవారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రికి కొత్తగూడెంతో పాటు చుట్టు పక్కల మండలాల నుంచి వందల సంఖ్యలో ప్రతిరోజు వస్తుంటారు. నడవలేనివారు, వృద్ధులు, కాలు విరిగివారు, సిమెంట్ పట్టీలు వేసుకున్న వారి కోసం కేవలం రెండు వీల్ చైర్లను మాత్రమే వినియోగిస్తున్నారు. ఆ చైర్లు కూడా విరిగిపోయి ఉన్నాయి. దీంతో సిబ్బంది ఆయా చైర్లకు తాళ్లు కట్టి ఉపయోగిస్తున్నారు. రోగులు వాటిపైనే స్కానింగ్, వైద్యుల దగ్గరకు వెళ్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓపీ, క్యాజువాలిటీ రెండు విభాగాలలో కూడా రెండు వీల్ చైర్లను మాత్రమే వాడుతున్నారు. ఆస్పత్రి స్టోర్ రూంలో కొత్తవి ఉన్నప్పటికీ వాటిని వాడడం లేదని ఆస్పత్రి వారి నిర్లక్ష్యాన్ని అర్థం చేసుకోవచ్చని పలువురు వాపోతున్నారు. ఆస్పత్రిలో థియేటర్, క్యాజువలిటీలో ఏర్పడిన చెత్తను తీసుకెళ్లి బయట పడేయడానికి మాత్రం కండిషన్‌లో ఉన్న వీల్ చైర్లను వినియోగిస్తుండడంతో వైద్యం కోసం వచ్చిన వారు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఆస్పత్రి అధికారులు చర్యలు తీసుకోవాలని, రోగులకు కొత్త వీల్ చైర్లను ఉపయోగించాలని పలువురు కోరుతున్నారు.

అవస్థలు పడుతున్నాం..



కొత్తగూడెం సర్వజన ఆస్పత్రిలో విరిగిపోయిన వీల్‌చైర్లతో ఇబ్బందులు పడుతున్నాం. చైర్‌లో కూర్చున్న రోగులు కాళ్లు పెట్టుకోవడానికి స్టాండ్ లేకపోవడం వలన అవస్థలు పడుతున్నారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన తాడు మీద కాలు పెట్టుకొని తీసుకెళ్తున్నాం.

– రాము, కొత్తగూడెం

కొత్త వాటిని ఉపయోగించాలి...



ఆస్పత్రికి వచ్చిన వృద్ధులు, కాలు విరిగినవారు, నడవలేని వారికి వీల్‌చైర్లు ఎంతో ఉపయోగపడతాయి. విరిగిపోయిన కుర్చీల వల్ల అందరూ ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి స్టోర్ రూంలో కొత్తవి ఉన్నా బయటకు తీయడం లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నవీన్, కొత్తగూడెం

డీఎంహెచ్‌ఓ కార్యాలయ ఏఓగా సుకృత



నియామకపత్రం అందుకుంటున్న సుకృత

కొత్తగూడెంఅర్బన్: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయ ఇన్‌చార్జ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా డాక్టర్ ఎం.సుకృత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్ నియామకపత్రాన్ని సుకృతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.మధువరుణ్, డాక్టర్ స్పందన, తేజశ్రీ, డిప్యూటీ డెమో ఫైజ్‌మొహినుద్దీన్, సీహెచ్‌ఓ నాగభూషణం, సూపరింటెండెంట్ కె.సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకం

చుంచుపల్లి: జనగణనలో భాగంగా కులగణన చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకమని బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోద్‌రావు గురువారం ఒక ప్రకటనలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ధన్యవాదములు తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ..

బీజేపీ దేశంలో కులగణనతో జనాభా లెక్కలు చేస్తున్నట్టుగా ప్రకటించిన సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రాత్రి కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. మాట్లాడుతూ.. కులగణన చేపట్టడం చరిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పైడిపాటి రవీందర్, జల్లారపు శ్రీను, చింతలచెరువు శ్రీను, సలీం, విజయ, పూర్ణ, విద్యాసాగర్ పాల్గొన్నారు.

టేకులపల్లి: దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ టేకులపల్లిలో నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో తేజావత్ శంభునాయక్, చిక్క వెంకటేశ్వర్లు, బోడ పుణ్యానాయక్, బానోత్ గంగా, వినోద్ కుమార్, నాగేందర్ పాల్గొన్నారు.



టేకులపల్లిలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ఇల్లెందు ఏరియాలో 82 శాతం బొగ్గు ఉత్పత్తి

ఇల్లెందు: బొగ్గు ఉత్పత్తిలో ఇల్లెందు ఏరియా 82 శాతం సాధించిందని ఏరియా జీఎం వీసం కృష్ణయ్య వెల్లడించారు. గురువారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన అధికారుల సమీక్ష సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఏప్రిల్‌కు నిర్దేశించిన లక్ష్యం 3.10 లక్షల టన్నులకు గానూ 2.56 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తి చేసి 82 శాతం లక్ష్యం సాధించినట్లు తెలిపారు.

శిథిలావస్థలో ఫారెస్టు క్వార్టర్లు

- ఆక్రమణలకు గురవుతున్న స్థలాలు
- పట్టించుకోని అధికారులు



పాపకొల్లులో కబ్జాకు గురైన స్థలం

జూలూరుపాడు: జూలూరుపాడు ఫారెస్ట్ రేంజ్‌లోని ఫారెస్టు క్వార్టర్లు నిరుపయోగంగా ఉన్నాయి. పాపకొల్లు, రాజారావుపేట, జూలూరుపాడు గ్రామాల్లో బీట్ ఆఫీసర్ల నివాసం కోసం నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అడవుల సంరక్షణ కోసం స్థానికంగా ఉండి విధులు నిర్వహించే అటవీ బీట్ ఆఫీసర్ల కోసం ఈ క్వార్టర్లు నిర్మించారు. జూలూరుపాడు అటవీ రేంజ్‌లో నాలుగు అటవీ సెక్షన్లు, 9 అటవీ బీట్లు ఉన్నాయి. పాపకొల్లు, రాజారావుపేట, రామచంద్రాపురం(గుండెపుడి), జూలూరుపాడులో మాత్రమే ఫారెస్టు బీట్ ఆఫీసర్ క్వార్టర్లు ఉన్నాయి. తొలినాళ్లల్లో ఫారెస్టు బీట్ ఆఫీసర్లు ఆ క్వార్టర్లలో నివాసం ఉండేవారు. కాలక్రమేణా పట్టణాల్లో నివాసం ఉంటూ విధులకు వచ్చిపోతున్నారు. దీంతో ఆ క్వార్టర్లు ఖాళీగా ఉండడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. అంతేకాకుండా ఆ క్వార్టర్ల స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. పాపకొల్లు గ్రామంలో 60 ఏళ్ల క్రితం ఫారెస్టు బీట్ ఆఫీసర్ క్వార్టర్ కోసం పెంకుటిళ్లు నిర్మించారు. అప్పటి నుంచి మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. రాజారావుపేటలో ఉన్న ఫారెస్టు క్వార్టర్ భవనం చుట్టూ స్థలం కబ్జా అయింది. కనీసం క్వార్టర్‌కు వెళ్లే దారి కూడా లేకపోవడం గర్హనీయం. స్థానికులు... ఎమ్మెల్యే, సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోవడం లేదు. అయితే రామచంద్రాపురం ఫారెస్టు క్వార్టర్‌లో నాలుగేళ్ల క్రితం ఓ వ్యక్తి నివాసం ఉంటుండగా అతన్ని ఖాళీ చేయించి తిరిగి క్వార్టర్‌ను ఆనాటి ఎఫ్ఆర్‌ఓ స్వాధీనం చేసుకున్నారు. క్వార్టర్ చుట్టూ ఫెన్సింగ్ వేయించారు. జూలూరుపాడు ఫారెస్టు క్వార్టర్ శిథిలావస్థలో ఉంది. పాపకొల్లు, జూలూరుపాడులో నూతన భవనాలు మంజూరు చేసి, అటవీ సిబ్బంది నివాసం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రాజారావుపేట, రామచంద్రాపురం ఫారెస్టు క్వార్టర్లను వినియోగంలోకి తీసుకొచ్చే విధంగా అటవీశాఖ ఉన్నతాధికారులు తగు చర్యలు చేపట్టాలని విన్నవిస్తున్నారు. ఈ విషయమై జూలూరుపాడు ఎఫ్ఆర్‌ఓ జి.ప్రసాద్‌రావును వివరణ కోరగా.. క్వార్టర్లు నివాసయోగ్యంగా లేవు. మరమ్మతులు చేపట్టే అవకాశం లేదు. స్థలాలను ఎవరైనా ఆక్రమించుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

వినియోగంలోకి తీసుకరావాలి..



పాపకొల్లు ఫారెస్టు క్వార్టర్‌ను వినియోగంలోకి తీసుకరావాలి. 60 ఏళ్ల క్రితం ఫారెస్టు బీట్ ఆఫీసర్ క్వార్టర్ శిథిలావస్థకు చేరుకుంది. పాములకు నివాసంగా మారింది. ఇళ్ల మధ్య ఉండటంతో రాత్రి సమయాల్లో భయంగా ఉంటుంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.– చౌడం నరేందర్, పాపకొల్లు

ఆఫీసర్లు స్థానికంగా ఉండాలి..



పాపకొల్లు, జూలూరుపాడు ఫారెస్టు క్వార్టర్ శిథిలావస్థలో ఉన్నాయి. ఆ స్థానంలో నూతన భవనాలు నిర్మించాలి. బీట్ ఆఫీసర్లు స్థానికంగా ఉండి విధులు నిర్వహించే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. ఫారెస్టు క్వార్టర్లను అందుబాటులోకి తీసుకరావాలి. – శ్రీనివాసరావు, పాపకొల్లు

మరమ్మతులు చేపట్టాలి..



పాపకొల్లు ఫారెస్టు క్వార్టర్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. నిరుపయోగంగా ఉన్న క్వార్టర్‌కు మరమ్మతులు చేపట్టాలి. అదేవిధంగా క్వార్టర్‌కు ఫెన్సింగ్ చేయాలి. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. – రాంశెట్టి వంశీ, పాపకొల్లు

అధ్వానంగా బీటీ రోడ్డు

- గుంతలు, కంకర తేలిన తడికలపూడి – చీమలపాడు రహదారి
- అధికారులు ప్రయాణించి చూడాలంటున్న ప్రజలు



తడికలపూడి - చీమలపాడు రోడ్డు దుస్థితి

టేకులపల్లి: మండలంలోని తడికలపూడి నుంచి కారేపల్లి మండలం చీమలపాడు వరకు బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. టేకులపల్లి మండలవాసులు ఇల్లెందు మీదుగా ఖమ్మం వెళ్లాలంటే దూరాభారం, హెవీ ట్రాఫిక్ ఉంటుంది. అదే తడికలపూడి నుంచి చీమలపాడు మీదుగా తిమ్మారావుపేట వయా ముచ్చర్ల క్రాస్‌రోడ్ నుంచి ఖమ్మం వెళితే దూరాభారం తగ్గడంతో పాటు ట్రాఫిక్ ఉండదు. వివిధ అవసరాల నిమిత్తం వ్యాపారులు, ప్రజలతో పాటు ఉద్యోగులు, రైతులు ఈ మార్గంలో ప్రయాణం సాగిస్తుంటారు. తడికలపూడి నుంచి చీమలపాడు వరకు మొత్తం ఏడు కిలోమీటర్లు అడుగడుగునా గుంతలు, కంకరతేలి ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. రోడ్డు అధ్వానంగా ఉండడంతో అదుపు తప్పి కిందపడటం, గాయాలపాలవడం, రాత్రి సమయంలో మరింత ప్రమాదకరంగా ఉంటుంది. పాలకులు స్పందించి ఈ రహదారికి నిధులు కేటాయించి తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఈ రోడ్డుకు మూడేళ్ల క్రితమే ఆర్ అండ్‌బీ అధికారులు రూ.3 కోట్ల అంచనాతో బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు కూడా పంపారు. అప్రూవ్ కూడా అయింది. నిధులు మంజూరై టెండర్ కూడా పూర్తయింది. కానీ ఏం జరిగిందో పనులు మాత్రం ప్రారంభించడం లేదు.

భయంభయంగా రావాల్సి వస్తోంది..



తడికలపూడి నుంచి తరుచూ ఖమ్మం వెళ్లి వస్తుంటాను. రోడ్డు గుంతలు, కంకర తేలి ఉండటంతో ప్రయాణం ఇబ్బందిగా ఉంటోంది. పలు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఇల్లెందు ఎమ్మెల్యే చొరవ తీసుకుని బీటీ రోడ్డు నిర్మించాలి.

– జగదీశ్ , తడికలపూడి

రోడ్డు త్వరగా నిర్మించాలి..



తడికలపూడి నుంచి చీమలపాడు రోడ్డు మంజూరు అయినప్పటికీ పనులు ఎందుకు ప్రారంభించడం లేదో అర్థం కావడం లేదు. ఈ మార్గంలో అధికారులు ప్రయాణిస్తే మా బాధలు తెలుస్తాయి. అడుగడుగునా గుంతలతో నరకం చూస్తున్నాం.

– అజ్మీర మోహన్, కోక్యాతండా